క్లుప్తంగా

అన్నదానానికి రూ.10,116 విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి గురువారం గ్రామానికే చెందిన చింతల వెంకట సుబ్బారావు దంపతులు రూ.10.116 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రంతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు జంగం ప్రసాదరావు, చిట్టిమళ్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మక్కపేట-భీమవరం మార్గం మధ్య రైల్వేగేటు మూసివేత

భీమవరం(వత్సవాయి): మక్కపేట-భీమవరం గ్రామాల మధ్య ఉన్న రైల్వేగేటు నాలుగు రోజులపాటు మూసివేయనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ సెక్షన్ ఇంజినీర్ జి.రవికుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ మేరకు రైల్వే అధికారులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రైల్వేగేటు మూసివేస్తున్నట్లు తెలియజేసే పత్రాన్ని ఎస్‌ఐ అభిమన్యుకు అందించారు. ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు విషయాన్ని గుర్తుంచుకుని సహకరించాలని ఎస్‌ఐ తెలిపారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత

గండేపల్లి(కంచికచర్ల): మండలంలోని గండేపల్లి గ్రామంలో సంగం లూర్దుమేరీ(48) గురువారం అనారోగ్యంతో మృతిచెందింది. ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా మట్టి ఖర్చుల కింద కుటుంబసభ్యులకు సర్పంచి బొక్కా రవికుమార్ రూ.10వేలు అందజేశారు. మిగిలిన రూ.90 వేల నగదు త్వరలో మంజూరయ్యేలా తగు చర్యలు తీసుకుంటామని సర్పంచి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పిల్లి భాగ్యలక్ష్మి, మాజీ ఉపసర్పంచి సంగం దేవరాజు, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీకళ తదితరులు పాల్గొన్నారు.

మామిడితోటల పరిశీలన



మామిడి రైతులతో మాట్లాడుతున్న ఉద్యానశాఖాధికారి వర్ధినీకుమారి

వత్సవాయి: ఉద్యాన శాఖాధికారులు గురువారం మండలంలోని పలు గ్రామాల్లో మామిడి తోటలను పరిశీలించారు. లింగాల, వత్సవాయి, గోపినేనిపాలెం, మంగొల్లు గ్రామాలలోని తోటలను పరిశీలించిన ఉద్యాన శాఖాధికారి వర్ధినీకుమారి మాట్లాడుతూ ప్రస్తుతం మామిడి తోటల్లో కాపు బాగానే వస్తోందని, రైతులు కాపును కాపాడుకోవాలన్నారు. సకాలంలో నీరు పెట్టడంతో పాటు మందులను పిచికారీ చేసుకోవాలన్నారు. కాయ పాకానికి రాకముందే రంగుమారి రాలిపోయే అవకాశం ఉన్నందున ప్లానోఫిక్స్ మందును పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు పంటను పరిశీలించుకుంటూ నిపుణుల సలహాల మేరకు మందులను పిచికారీ చేసుకుంటే మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉందని రైతులకు తెలిపారు.

గౌసియా జామా మసీదు నిర్మాణానికి భూమిపూజ



వీరులపాడు: మండలంలోని జుజ్జూరు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న గౌసియా జామా మసీదు నిర్మాణ పనులకు గురువారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చీమలపాడు బాబా ఖాజా మొహిద్దీన్ మాట్లాడుతూ ముస్లింల ఐక్యతతో మసీదు నిర్మాణం జరుగుతోందన్నారు. అనంతరం పెద్ద సంఖ్యలో ముస్లింలు ప్రత్యేక నమాజ్ చేశారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, వైస్ ఎంపీపీ నాగుల్‌మీరా, నాయకులు రజ్వీ, లాల్ అహ్మద్ గౌస్, మత పెద్దలు, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కారు ఢీ కొని గాయాలు

పాయకాపురం(విజయవాడరూరల్): ద్విచక్ర వాహనాన్ని ఆపి ఫోను మాట్లాడుతున్న వ్యక్తిని వెనుకనుంచి వచ్చిన కారు ఢీ కొన్న ఘటనలో వ్యక్తి గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నున్నలో మటన్‌షాపులో పనిచేస్తున్న పఠాన్ ఖాజాఖాన్ ఈ నెల 15న నున్న నుంచి విజయవాడ వెళ్లా మోటారు సైకిల్ ఆపి ఫోను మాట్లాడుతున్నాడు. అక్కడ గ్యాస్ కంపెనీ వద్ద వెనుక నుంచి వచ్చిన కారు అతన్ని ఢీ కొట్టింది. సంఘటనలో అతని కుడి కాలికి గాయమైనట్టు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సుపరిపాలనతో చెరగని ముద్ర

- రూ.40.20 లక్షలతో గ్రామ సచివాలయం
- ప్రారంభించిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



అల్లూరులో నూతన సచివాలయ ప్రారంభోత్సవంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వీరులపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన మూడున్నరేళ్ల సుపరిపాలనతో ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని అల్లూరు గ్రామంలో రూ.40.20 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన వలంటీర్, సచివాలయ వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వ పాలనలో గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాలు కూడా సరిగా లేక ప్రజలు నానా అవస్థలు పడ్డారని తెలిపారు. కానీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పంచాయతీ భవనాలు లేని గ్రామాల్లో సచివాలయ భవనాలను నిర్మించి గ్రామ పాలన సజావుగా సాగేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు.

అభివృద్ధి పథంలో గ్రామాలు

గ్రామీణ ప్రాంతాలు పట్టణాలకు దీటుగా అభివృద్ధి చెందుతున్నాయని జగన్‌మోహనరావు అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంత ప్రజలకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తుండటంతో గ్రామాలు సైతం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయని గుర్తు చేశారు. ప్రజల వద్దకే పాలన అని ఊదరగొట్టకుండా వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ఇళ్ల ముంగిటకే పాలన తీసుకువచ్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ కోటేరు మల్లేశ్వరి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ బందెల రాణి, మాజీ సర్పంచ్ కోటేరు సూర్యనారాయణ రెడ్డి, నాయకులు ఇప్పల కృష్ణారెడ్డి, వేమూరి ఆదాం, నాగేశ్వరరావు, రాజగోపాల్ రెడ్డి, ఇప్పల సత్యనారాయణ రెడ్డి, మొండ్రు బాయమ్మ, బోనాల సతీష్, జంగా కోటిరెడ్డి, వేమిరెడ్డి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యకు పెద్ద పీట వేస్తున్న ప్రభుత్వం



కంచికచర్ల మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మలక్‌బషీర్

ఎంపీపీ మలక్‌బషీర్

కంచికచర్ల: ప్రభుత్వం విద్యా వ్యవస్థలో పెనుమార్పులు తీసుకువచ్చి, నాణ్యమైన విద్యనందించటంతో పాటు మధ్యాహ్న భోజన పథకాన్ని పటిష్టంగా అమలు చేస్తుందని ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండల పరిషత్ నుంచి రూ.కోటి నిధులతో అన్ని గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం, బోరు పంపులు వేయించామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు పోషక విలువలతో కూడిన నాణ్యమైన, శుభ్రమైన ఆహారాన్ని అందించాలని అధికారులను ఆదేశించారని అన్నారు. జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి మాట్లాడుతూ ఇప్పటికే మండలంలోని కొన్ని గ్రామాలకు రూ.20 లక్షల నిధులు మంజూరు చేయించి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఎంఈఓ చిట్టిబాబు మాట్లాడుతూ బైజూస్ కంపెనీ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదివే విద్యార్థులకు ట్యాబ్‌లు ఉచితంగా పంపిణీ చేశామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయి ప్రియ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీరు నిత్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. సీడీపీఓ లక్ష్మీభార్గవి మాట్లాడుతూ గర్భిణీ, బాలింతలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని నిత్యం అందిస్తున్నామని, చిన్నారులకు కూడా మంచి ఆహారాన్ని మెనూ ప్రకారం అందజేస్తామన్నారు. ఆర్ఐ శిరీష మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే 20,964 రేషన్ కార్డుదారులున్నారని, ఇంకా రేషన్ కార్డు అవసరమైన వారు గ్రామ సచివాలయాల్లో రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుని కార్డును పొందాలన్నారు. కంచికచర్ల పీహెచ్‌సీ డాక్టర్ కె.మధురిమ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఇప్పటికే 65 కాన్పులు చేశామన్నారు. బీపీ, సుగర్, రక్త పరీక్ష, కిడ్నీలకు సంబంధించిన పరీక్షలు చేసేందుకు ప్రభుత్వం అవసరమైన పరికరాలను అందజేసిందని పరీక్షలు కావల్సిన వారు ఉచితంగా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పంచాయతీ రాజ్‌శాఖ ఏఈఈ టీవీ రవికుమార్ మాట్లాడుతూ మండలంలో 17 గ్రామ సచివాలయాల భవనాలు మంజూరయ్యాయని ఇప్పటికే అన్నీ పూర్తి చేశామన్నారు. రైతు భరోసా కేంద్రాలు 17 మంజూరు కాగా 7 భవనాలను పూర్తి చేశామని, మిగిలినవి పలు విభాగాల్లో నిర్మాణ దశల్లో ఉన్నాయని అన్నారు. విద్యుత్‌శాఖ ఏఈ కృష్ణారావు మాట్లాడుతూ వైఎస్సార్ జగనన్న కాలనీలలో లబ్ధిదారులు కరెంటు కష్టాలు పడకుండా అన్ని లే అవుట్లలో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశామని, మిగిలిన గ్రామాల్లో పనులు ప్రారంభించామని చెప్పారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు బండి మల్లికార్జునరావు, వెలగలేటి మాధవి, సర్పంచి వేల్పుల సునీత, ఎంపీడీఓ కె.బాలశంకరరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకాదశి పూజలు



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని శ్రీచెన్నకేశవస్వామి ఆలయంలో గురువారం ఏకాదశి పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామునే శ్రీభూగోధ సమేత చెన్నకేశవ ఆలయంలో అర్చకులు స్వామి, అమ్మవారికి పంచముఖ అభిషేకం నిర్వహించారు. అనంతరం నూతన వస్త్రాలతో తీర్చిదిద్ది పూలమాలతో అలంకరించి కర్పూర హారతులు సమర్పించారు. స్థానిక ఆనందసాయి ఆలయంలో గురువారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి బాబాకు విశేష పూజలు నిర్వహించారు.

కూడలిలో శివరాత్రి సందడి



నందిగామ: శివరాత్రి పర్వదినం నేపథ్యంలో మండల పరిధిలోని దాములూరు కూడలిలో శ్రీ సంగమేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలకు ఆలయం ముస్తాబయింది. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో పలు దుకాణాలను ఏర్పాటు చేశారు.

తిరుపతమ్మకు బంగారు బొట్టు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మ తల్లికి జగ్గయ్యపేట పట్టణానికి చెందిన సీహెచ్ సురేష్‌రెడ్డి గురువారం తొమ్మిది గ్రాముల బంగారు బొట్టును విరాళంగా సమర్పించారు. దాతకు ఆలయ అధికారులు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్లు బద్దుల కృష్ణప్రసాద్, జంగం ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి పటిష్ట బందోబస్తు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ టి.కె.రాణా

ముక్త్యాల(జగ్గయ్యపేట): మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 18న గ్రామంలో ఉన్న భవానీ ముక్తేశ్వర స్వామి వారి ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారనే అంచనా నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా తెలిపారు. ఆయన గురువారం ఆలయ పరిసరాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శివరాత్రి సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు వస్తారనే అంచనాతో ఆలయం వద్ద పూర్తి స్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా కృష్ణానదిలో పుణ్య స్నానాలు చేసే భక్తులకు పలు నిబంధనలు ఏర్పాటు చేశామన్నారు. జల్లు స్నానాలతో పాటు నది ఒడ్డున ఐదు అడుగుల వరకు మాత్రమే నదిలోకి భక్తులను అనుమతిస్తామని తెలిపారు. ఒడ్డున ప్రత్యేకంగా గజ ఈతగాళ్ల ఏర్పాటుతో పాటు ఇనుప కంచెలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ప్రత్యేక సిబ్బందిని నియమిస్తున్నామని చెప్పారు. బల్లకట్టు, పడవ ప్రయాణాలను పూర్తిగా నిషేధిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీపీ మేరీ ప్రశాంతి, ఏసీపీ నాగేశ్వరరెడ్డి, సీఐ నాగమురళి, ఎస్‌ఐలు దుర్గాప్రసాద్, రామారావు, నాగదుర్గాప్రసాద్, ఈవో నాగరాజు, కార్యదర్శి నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

గృహ సారథులే వైఎస్సార్‌సీపీ బలం

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్

కంచికచర్ల: ప్రజలకు ప్రభుత్వానికి, పార్టీకి గృహ సారథులే బలం, బలగం అని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ అన్నారు. కంచికచర్ల కస్తూరి గార్డెన్‌లో గురువారం రాత్రి గృహసారథులు, వలంటీర్లతో వారు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని, తమకు కేటాయించిన కుటుంబాలతో మమేకమై ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఇప్పటికే కంచికచర్లలో ఎంతో అభివృద్ధి చేశామని, రానున్న కాలంలో మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. గ్రామంలో ప్రభుత్వ డిగ్రీ రెసిడెన్సీ కళాశాలను తీసుకువచ్చామని, అనేక సిమెంట్ రోడ్లు వేశామన్నారు. కంచికచర్ల నుంచి తెలంగాణ ప్రాంతం ఎర్రుపాలెంకు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డును వెడల్పు చేసి అభివృద్ధి చేశామన్నారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్‌బాబు, మండల కన్వీనర్ నన్నపనేని నరసింహారావు, ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, సర్పంచి వేల్పుల సునీత, ఎంపీటీసీ సభ్యులు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

- 1.40 లక్షల విలువైన బంగారం, వెండి స్వాధీనం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నగరంలోని ఎస్ఎస్‌పురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక ఇంట్లో ఈ నెల 14వ తేదీన జరిగిన చోరీ కేసులో పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి అతని నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యల్లాప్రగడ సత్యనారాయణ కొరియర్ ఆఫీస్‌లో గుమాస్తా. అతను భార్య రమాదేవితో కలసి పూర్ణానంపేటలో నివాసిస్తున్నారు. వారు ఈ నెల 14న రాత్రి 7 గంటలకు ఇంటికి తాళం వేసి దేవాలయానికి వెళ్లారు. తిరిగి 8.30 గంటలకు రాగా ఇంటి తాళాలు పగలకొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా బీరువా తాళం తెరచి ఉంది. అందులో ఉండాల్సిన బంగారం, వెండి వస్తువులు కనిపించలేదు. దీనిపై పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో పూర్ణానందంపేట, లక్ష్మణరావువీధిలో నివసించే ధూపాటి వెంకటకృష్ణ అలియాస్ కృష్ణ(29) నేరానికి పాల్పడినట్లు నిర్ధారించుకున్నారు. గురువారం నిందితుడు కాళేశ్వరరావు మార్కెట్ వద్ద చోరీ సొత్తు విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 1.40 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు.

ప్రజల సంక్షేమం, అభివృద్ధే సీఎం జగన్ లక్ష్యం

ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు



పరిటాలలో మహిళను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కంచికచర్ల: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం సుపరిపాలన అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని పరిటాల గ్రామ సచివాలయం-1లో గురువారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి, ప్రజలను ఆప్యాయంగా పలుకరించడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందుతున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలను రాజకీయాలకతీతంగా అమలు చేస్తూ, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చుతున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. అన్ని వర్గాల సంతోషం, సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. ఉన్నత కులాల్లోని నిరుపేదలకు ఆర్థికసాయం అందించడం, ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ, అర్హత గల ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయటంతో పాటు ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్లు పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, సర్పంచి యద్దనపూడి ఆనందజ్యోత్స్న, గ్రామ సచివాలయ మండల కన్వీనర్ చింతా రవీంద్రనాథ్, ఏఎంసీ వైస్ చైర్మన్ మాడుగుల శంకర్, ఎంపీటీసీ సభ్యులు కర్ల రాధిక, వైఎస్సార్ సీపీ నాయకులు మార్త శ్రీనివాసరావు, కర్ల రామకృష్ణ, జానుబాబు, జమలయ్య, ఏసుబాబు, ఆవల విజయ్, యద్దనపూడి విజయారావు, పంచాయతీ కార్యదర్శి మీర్జావలి, వీఆర్వో శేషం సురేష్, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు



పేరకలపాడు క్రాస్‌రోడ్డు వద్ద నేషనల్ హైవేపై ప్లాస్టిక్ పోల్స్ ఏర్పాటు చేస్తున్న ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం

కంచికచర్ల: పోలీస్ కమిషనర్ టీకే రాణా, డీసీపీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు నందిగామ ఏసీపీ జి.నాగేశ్వరరెడ్డి, నందిగామ రూరల్ సర్కిల్ సీఐ ఐవీ నాగేంద్రకుమార్ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాద నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎస్‌ఐ పెంకె సత్య వెంకట సుబ్రహ్మణ్యం అన్నారు. కంచికచర్ల పేరకలపాడు క్రాస్ రోడ్డు సమీపంలో నేషనల్ హైవేపై గురువారం రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారణకు ప్లాస్టిక్ పోల్స్ స్టాపర్ బోర్డులు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాలు జరిగే హైవేపై గుర్తించామన్నారు. పరిటాల, కీసర, పేరకలపాడు క్రాస్‌రోడ్డు, కంచిలమ్మ చెరువుకట్ట, చెవిటికల్లు సెంటర్ తదితర ప్రాంతాలను గుర్తించి ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. వాహనదారులు అధిక వేగంతో వాహనాలు నడపకుండా జాగ్రత్త వహించాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, టోల్‌ప్లాజా సిబ్బంది పాల్గొన్నారు.

ఆరవ వార్డు సమస్యలకు త్వరలో పరిష్కారం

మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్



ఆరవ వార్డులో సమస్యలను తెలుసుకుంటున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ఆరవ వార్డులో లోవోల్టేజీ సమస్య, తాగునీటి సమస్య, పారిశుద్ధ్య సమస్యలకు త్వరలో పరిష్కారం లభిస్తుందని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ తెలిపారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఆదేశాల మేరకు పట్టణంలోని మున్సిపల్ కౌన్సిలర్లు వార్డుల్లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖాదర్‌బాబు స్థానిక ఆరవ వార్డులో పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డులో తాగునీరు సరిగా రావడం లేదని పలువురు వారి దృష్టికి తీసుకురాగా, పట్టణానికి తాగునీరు అందించే హెడ్ వాటర్ వర్క్స్‌లో ప్రధాన మోటరు మరమ్మతులకు గురవడంతో విజయవాడలో రిపేరుకు ఇచ్చామని, తాను గురువారం విజయవాడ వెళ్లి మోటరు మరమ్మతు పనులను పరిశీలించినట్లు తెలిపారు. రెండు మూడు రోజుల్లో మోటరు తీసుకువచ్చి బిగిస్తారని, తద్వారా ఏడు వార్డుల ప్రజలకు తాగునీటి సరఫరా పుష్కలంగా ఉంటుందన్నారు. లోవోల్టేజీ సమస్యలను ఎమ్మెల్యే ఉదయభాను దృష్టికి తీసుకువెళ్లామని, త్వరలో పట్టణంలో పలుచోట్ల కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేస్తారని తెలిపారు. పారిశుద్ధ్యం విషయంలో కాలువల్లో చెత్త, వ్యర్థాలను పారిశుద్ధ్య సిబ్బందితో ఎప్పటికప్పుడు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు

నందిగామ టౌన్: నందిగామలో జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకోవటం, అభివృద్ధి చేస్తున్న శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్‌లపై అసత్య ఆరోపణలు చేయటం టీడీపీ నాయకులకు పరిపాటిగా మారిందని ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నందిగామలో 30 ఏళ్లుగా అధికారంలో ఉండి టీడీపీ చేసిందేమిటో ప్రజలకు చెప్పాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నందిగామ పట్టణాన్ని, నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే సోదరులు అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. ముఖ్యంగా సీఎం రోడ్డును విస్తరించి అభివృద్ధి చేశారని, పట్టణంలోని ప్రధాన రహదారులను సైతం విస్తరించి అభివృద్ధి చేస్తున్నారన్నారు, ఈ పనుల్లో భాగంగా రహదారి నిర్మాణాలకు అడ్డుగా ఉన్న చెట్లను అన్ని అనుమతులతో తొలగిస్తుంటే ఆరోపణలు చేయటం హాస్యాస్పదంగా ఉందన్నారు. చేసి చూపుతున్న అభివృద్ధి చూసి ఓర్వలేక అవినీతి ఆరోపణలు చేస్తున్నారని, వాటిని ప్రజలు నమ్మే స్థితిలో లేరని హితవు పలికారు. సమావేశంలో ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ గుడివాడ సాంబశివరావు, పీఏసీఎస్ చైర్మన్ పాములపాటి రమేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ నల్లమల్లి మురళి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం



పసుపుకొట్టే కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

జగ్గయ్యపేట అర్బన్: మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని శ్రీగోవిందమాంబ సమేత శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి, మాతా ఈశ్వరీదేవి, శ్రీపాదరస లింగేశ్వర స్వామి దేవస్థానంలో వీరబ్రహ్మేంద్రస్వామి వారి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఉపాసకులు సోమోజు సాయిరామాచార్యులు తెలిపారు. ఈనెల 18 వ తేదీన స్వామి వారి కల్యాణ మహోత్సవం జరుగుతుందని తెలిపారు. వేడుకల్లో భాగంగా గురువారం పసుపుకొట్టే కార్యక్రమం జరిగింది. శుక్రవారం మంగళ స్నానాలు, శనివారం సాయంత్రం 7 గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం, ఆదివారం సాయంత్రం పవళింపు సేవ, సోమవారం వసంతోత్సవం కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరుగుతాయని తెలిపారు.

ప్రమాదాల నివారణే లక్ష్యం



జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సిమెంట్ బ్లాకులు

నందిగామ: రోడ్డు ప్రమాదాలు నియంత్రించేందుకు అవసరమైన అన్ని జాగ్రత్త చర్యలు చేపడుతున్నట్లు ఎస్‌హెచ్‌ఓ సతీష్ తెలిపారు. 65వ నంబర్ జాతీయ రహదారిపై ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించిన పోలీసులు ఆయా ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గురువారం జాతీయ రహదారిపై పట్టణ శివారులోని వై.జంక్షన్ వద్ద ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు సిమెంట్ బ్లాక్‌లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ మాట్లాడుతూ ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తూ వాహనాలను నడపితే ప్రమాదాలను నియంత్రించవచ్చన్నారు. ముఖ్యంగా మద్యం తాగి వాహనాలు నడపడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్లను గుర్తించామని, ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు అవసరమైన అన్ని జాగ్రత్త చర్యలు చేపడుతున్నామన్నారు.

ప్రకటన

[illegible]

పి. రామమోహనరావు, దాము లక్ష్మణ కుమార్, ఎ.రాజారాజేశ్వరి, అడ్వకేట్స్, డోరు నెం.23-2-1, సత్యనారాయణపురం, విజయవాడ-11, సెల్: 9392114922